# కాంగ్రెస్‌ను నమ్మితే కష్టాలే..




వంకేశ్వరం కాంగ్రెస్ నాయకులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

- కర్ణాటకలో హస్తం పాలన చూస్తే అధోగతే..
- బీఆర్‌ఎస్‌కు ప్రజలు అండగా నిలవాలి
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు
- వెల్టూర్‌లో ఇంటింటి ప్రచారం

ఉప్పునుంతల, నవంబర్ 11: కాంగ్రెస్ నాయకులు చెప్పే ఆరు గ్యారెంటీ పథకాలను నమ్మి ఓటేస్తే కోరి కష్టాలను కొనితెచ్చుకోవడమేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శనివారం రాత్రి మండలంలోని వెల్టూరులో గువ్వల ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మాయమాటలు నమ్మిన కర్ణాటక ప్రజలు వారికి అధికారం అప్పగిస్తే అధోగతి పాలు చేశారని, ప్రజలు, రైతులు కరెంట్ లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇక్కడ చెప్పే గ్యారెంటీలే అమలులో లేవని చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ నాయకులు పూటకో మాట మాట్లాడుతున్నారని, ఒకరు రైతుబంధు అవసరం లేదంటే మరొకరు మూడు గంటలు రైతులకు కరెంట్ ఇస్తే చాలని అంటున్నారని, తెలంగాణ ప్రభుత్వం నేడు 24 గంటల పాటు ఉచిత కరెంట్‌ను వదిలిపెట్టి మూడు గంటల కరెంట్‌ను తెచ్చుకోవాలా ఒక సారి ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో మరోసారి బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే అభివృద్ధితోపాటు మరిన్ని సంక్షేమ పథకాలు అమలులోకి వస్తాయని ముఖ్యంగా వృద్ధులు, వితంతువులకు ఇస్తున్న రూ.3 వేల పింఛన్ రూ.5వేలు అవుతుందని, దివ్యాంగులకు రూ.6 వేలు అవుతుందని చెప్పారు. అదేవిధంగా మహిళలకు రూ.3వేలు ఇవ్వడంతోపాటు రూ.400లకే సిలిండర్ అందిస్తుందని, తెల్లకార్డు ఉన్న ప్రతిఒక్కరికీ రూ.5లక్షల కేసీఆర్ బీమా అమలుకానుందని వివరించారు. అందుకే ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని అమలు చేసే బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని, కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్ సారును మరోసారి సీఎంను చేసుకుందామని గువ్వల పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ భూపాల్‌రావు, నాయకులు పద్మనాభరెడ్డి, కురుమయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నేతలు

అమ్రాబాద్, నవంబర్ 11 : ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మొద్దని, నమ్మితే ఆగమయ్యేది మనమేనని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. పదర మండలంలోని వంకేశ్వరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజగిరి బద్రు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి శనివారం అచ్చంపేటలో ఎమ్మెల్యే గువ్వల బాలరాజు సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు బ్రహ్మం, విష్ణుమూర్తి కాంగ్రెస్ నాయకుల మాయ మాటలు విని కాంగ్రెస్ పార్టీలో చేరగా పార్టీలో వారికి ఎలాంటి గుర్తింపు లభించకపోవడంతో వారు తిరిగి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ మాయ మాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టడం తప్పా చేసేదేమి లేదని నిజం తెలుసుకొని బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



వెన్నచర్ల ప్రచారసభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం, చిత్రంలో ఎమ్మెల్యే బీరం

# బీరంను ఆశీర్వదించండి

- బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం
- ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి
- జూపల్లిని చిత్తుగా ఓడించాలి
- మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి
- వెన్నచర్లలో ఎన్నికల ప్రచారం ప్రారంభం

పెదద్దకొత్తపల్లి, నవంబర్ 11: కొల్లాపూర్ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని చూసి మరోసారి బీరం హర్షవర్ధన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని వెన్నచర్లలో కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి మాజీ మంత్రి నాగంతో కలిసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామప్రజలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి వారికి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా మాజీ మంత్రి బీఆర్‌ఎస్ సీనియర్‌నాయకుడు నాగం జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కేఎల్‌ఐ కాల్వల సైజు తగ్గించి రైతులను ఇబ్బందులు పెట్టి కాంట్రాక్టర్లకు లబ్ధి చేరే విధంగా చేశారని ఆయన విమర్శించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో ఆయన అభివృద్ధి ఏమాత్రం కనిపించడం లేదని ఎన్నికల్లో ఆయన్ను చిత్తుగా ఓడించాలని ప్రజలకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గంలో నేను చేసిన అభివృద్ధి పనులు మీ ముందు కనిపిస్తున్నాయని అందుకే మీరు తనను ఒక అన్నలా, తమ్ముడిలా, కొడుకులా ఆదరిస్తే మీకు తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాగానే వృద్ధులకు రూ.5వేల పింఛన్ అందించడంతోపాటు తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రూ.5లక్షల ఇన్సూరెన్స్ వర్తింపజేస్తామని, మహిళలకు రూ.400కే సిలిండర్ అందస్తామని చెప్పారు. రాష్ట్రం, నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ప్రజలు బీఆర్‌ఎస్ ఆశీర్వదించి సీఎం కేసీఆర్‌కు కొల్లాపూర్‌ను గెలిపించి కానుక ఇద్దామని పిలుపునిచ్చారు. అనారోగ్యాలకు గురైన కుటుంబాలను సీఎంఆర్‌ఎఫ్ అందించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మహిళలతో కలిసి బొడ్డెమ్మ వేసి మహిళలను ఉత్సహపర్చారు. కార్యక్రమంలో జిల్లా బీఆర్‌ఎస్ నాయకుడు గౌరవరం వెంకట్‌రెడ్డి, డాక్టర్ కురుమ విజయ్‌కుమార్, మాజీ సర్పంచ్ పవన్‌కుమార్‌శర్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గణేశ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ రాజాగౌడ్, కొల్లాపూర్ తాలూకా బీఆర్‌ఎస్ నాయకుడు దగడాల సుదర్శన్‌గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



శనైశ్చరుడికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

# ఘనంగా శనిత్రయోదశి

- శనైశ్చరుడికి తిలతైలాభిషేకాలు

బిజినేపల్లి, నవంబర్ 11: మండలంలోని నంది వడ్డేమాన్ గ్రామంలో శనివారం ఆశ్వీజ శని త్రయోదశిని పురస్కరించుకొని భక్తులు సార్థ సప్త జేష్ఠమాత సమేత శనైశ్చరస్వామికి తెల్లవారు జామునుంచే ప్రత్యేకంగా తిల తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ శనివారం త్రయోదశి రావడంతో శనేశ్వరస్వామిని పూజించినా విశేష పుణ్యఫలితం లభిస్తుందని తెలిపారు. భక్తులు వారి జన్మరీత్యా, గోచార రీత్యా ఉన్న అర్ధాష్టమ శని, అష్టమ శని, ఏలినాటి శని, నక్షత్రంలో గోచార రీత్యా, సంచార రీత్యా శనిగ్రహ దోషాలు నివారణకు, శనిగ్రహ శాంతికోసం స్వామిని నువ్వుల నూనె, జిల్లేడుపూలు, జమ్మి ఆకులతో పూజించాలని చెప్పారు. అదేవిధంగా ఆలయ ఆవరణలోని బ్రహ్మసూత్రం గల పరమశివుడికి భక్తులు రుద్రాభిషేకం, శివ అష్టోత్తరం, అర్చనలు వీరశైవ ఆగమానుసారం నిర్వహించారు. అనంతరం మహా గణపతిస్వా మివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులకు భక్తుల కోసం నీటి వసతితోపాటు అల్పాహారం, భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గోపాలరావు, సర్పంచ్ సుదర్శన్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు వీరశేఖర్, ప్రభాకర్, పుల్ల య్య, అర్చకులు శాంతికుమార్, ఉమామహేశ్వర్, జయంత్, మల్లికార్జున శాస్త్రి, శ్రావణ్‌కుమార్, శివకుమార్‌తోపాటు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- మూడో సారి కేసీఆర్‌ను సీఎం చేసుకుందాం
- ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి
- నాగర్‌కర్నూల్‌లో ముమ్మర ప్రచారం
- అడుగడుగునా నీరాజనం పలుకుతున్న ప్రజలు



నాగర్‌కర్నూల్‌లో పచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, నవంబర్ 11 : నాగర్‌కర్నూల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని, మరింత అభివృద్ధి చేసుకోవాలంటే మరోసారి బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి రావాలని, కేసీఆర్‌ను మూడోసారి సీఎంను చేసుకుందామని నాగర్‌కర్నూల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నాగర్‌కర్నూల్ పట్టణంలో ఎమ్మెల్యే మర్రి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువార్డుల్లో తిరుగుతూ ముఖ్యనేతలను కలుసుకున్నారు. ప్రతిపక్ష నేతలను సైతం కలుస్తూ గెలుపు సహరించాలని కోరారు. ఉదయం నుంచే మొదటగా పట్టణంలోని 21, 22వ వార్డుల్లో ముఖ్య నేతలను కలుస్తూ తన గెలుపునకు సహకరించాలని కోరారు. మధ్యాహ్నం అనంతరం 17వ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. పలువురు డాక్టర్లు, వ్యాపారులు, ప్రతిపక్ష నేతలను కలుస్తూ ఓటును అభ్యర్థించడంతో మంచి స్పందన లభించింది. నాగర్‌కర్నూల్ మరింత అభివృద్ధి కావాలంటే బీఆర్‌ఎస్‌పార్టీయే మళ్లీ అధికారంలోకి రావాలని, బీఆర్‌ఎస్ పార్టీ తొమ్మిదేండ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి చూడాలని, మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అయితే 17వ వార్డులో ఎమ్మెల్యే మర్రి ఓ కుటుంబం అప్యాయంగా పలకరించింది. రాజు, నందిని దంపతుల కూతురు ఆకాంక్షకు లివర్ సమస్యతో బాధపడుతున్న సమయంలో ఎమ్మెల్యే మర్రి ఎల్‌వోసీ రూపంలో రూ.7 లక్షలను అందజేసి తమ కూతురు ప్రాణాలను కాపాడాడని సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆకాంక్ష ఆరోగ్య పరిస్థితులను ఎమ్మెల్యే మర్రి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డుల్లోని పలు ఇండ్లకు వెళ్లి ఓటును అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిరిగిన ప్రతి వార్డుల్లోనూ ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఇప్పటికే పట్టణంతోపాటు ఆయా మండలాల్లో ఎంతో అభివృద్ధి చేశామని, ఇంకా చేయాల్సి ఉందని, మీ సహకారంతో మరోసారి విజయం సాధిస్తే పట్టణాన్ని మరింత అభివృద్ధి దిశగా తీర్చిదిద్దుతామని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాబురావు, కౌన్సిలర్లు, జక్కా రాజ్‌కుమార్‌రెడ్డి, బచ్చన్న, నాయకులు భాస్కర్‌గౌడ్, బొడ్డు రమణ, వెంకట్రాములు, తేజసురేందర్‌రెడ్డి, సంపత్‌కుమార్, ఏలిమె సత్యం, బాదం రమేశ్, వనపట్ల సుబ్బయ్య, ఆలూరి నరేందర్, పాషా, పాలమూరు రాము, ప్రసాద్‌తోపాటు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



చుక్కాపూర్‌లో నిర్వహించిన సదర్ ఉత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

# కులవృత్తులకు తెలంగాణలో పెద్దపీట

- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- చుక్కాపూర్‌లో సదర్ ఉత్సవాలు

తలకొండపల్లి, నవంబర్11: కులవృత్తులకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, రాష్ట్రంలో సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. శనివారం తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదర్ ఉత్సవాలకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో గొల్లకురుమలు సంప్రదాయ దుస్తులతో దున్నపోతులో ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గొల్లకురుమలకు గొర్రెలను అందించి ఆదుకుంటున్నదని గుర్తు చేశారు. అదేవిధంగా బీసీలకు బీసీ బంధు పేరుతో ఆర్థికంగా చేయూతనిస్తున్నదని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో పండుగలను ప్రజలు కలిసిమెలిసి జరుపుకోవాలన్నారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనం అని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, సర్పంచ్ కిష్టమ్మ, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీశైలం, విష్ణువర్ధన్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, రంగారెడ్డి, కృష్ణయ్య, రాములు, మల్లేశ్, కుమార్, జంగయ్య, ప్రవీణ్, రాజు, శేఖర్, మల్లయ్య, పర్వతాలు, అంజయ్య తదితరలు పాల్గొన్నారు.